31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 24 అక్టోబర్ 2025 పేజీలు : 8

# డ్రగ్స్ నిర్మూలనకు అందరూ సహకరించాలి

◆కలెక్టర్ పమేలా సత్పతి



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :** డ్రగ్స్ ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహిళలు,పిల్లలు దివ్యాంగులు & వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా మహిళలకు, కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను తెలియపరిచే రంగోలీ పోటీలు నిర్వహించారు.కరీంనగర్ క్లబ్ వద్ద రోడ్డుపై ఏర్పాటుచేసిన ఈ రంగోలీ పోటీలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల యువత, విద్యార్థులు

2లో

# లక్ష్యం రూ.లక్ష కోట్ల పెట్టుబడులు...

◆లైఫ్ సైన్సెస్ లో 5 లక్షల మందికి ఉపాధి

◆2030 నాటికి కల్పించేలా "రోడ్ మ్యాప్"

◆త్వరలోనే అందుబాటులోకి "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ"

◆బయో-డిజిటల్" యుగానికి అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్

◆తెలంగాణ అంటే భవిష్యత్తు... అవకాశాల ఖని

◆ఆస్‌బయోటెక్ 2025" సదస్సులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 23 :** లైఫ్ సైన్సెస్ లో 2030 నాటికి కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్‌బయోటెక్', విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో మెల్ బోర్న్ లో నిర్వహిస్తున్న 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన గురువారం కీలకోపన్యాసం చేశారు. రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్ "గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు.

**250 బిలియన్ డాలర్లకు చేర్చేలా....**

భౌగోళికంగా 11వ స్థానం, జనాభాలో 12వ స్థానంలో ఉన్నప్పటికీ, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా 5 శాతం కంటే ఎక్కువగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 2024-2025లో తెలంగాణ జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం కాగా, జాతీయ సగటు కేవలం 7.6 శాతం మాత్రమే

2లో

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను

# సద్వినియోగం చేసుకోవాలి



◆18 క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని 30 క్వింటాళ్లకు పెంచాలి

◆మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23 :** తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసు కోవాలని,18 క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని 30 క్వింటాళ్లకు పెంచాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల మండలం చల్గల్ వ్యవసాయ మార్కెట్లోనిమొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి సందర్శించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొక్క జొన్న తేమశాతాన్ని జీవన్ రెడ్డి తేమశాతం యంత్రంతో పరిశీలించారు. ఎకరానికి 18క్వింటాళ్ల వరకు మాత్రమే మొక్కజొన్న మాత్రమే కొనుగోలు చేస్తున్నారని జీవన్ రెడ్డికి తీసుకెళ్లారు.ఈ సందర్భం గా జీవన్ రెడ్డి మాట్లాడుతూ

2లో

# జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

◆జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23 :** జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని 38వ వార్డులో 30 లక్షలతో సీసీ రోడ్డు డ్రైనేజీ నిర్మాణ పనులకు 37వ వార్డులో రూ.10 లక్షలతో డ్రైన్ స్లాబ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా 38వ వార్డులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే డా.సంజయ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని కోరగానే జగిత్యాలకు రూ.50కోట్ల నిధులు మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. మోతే మాల వాడ ప్రాంతంలో మహిళ సంఘం భవనానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని, జగిత్యాల పట్టణాన్ని సుందరంగా మార్చడం లో మహిళలు, ప్రజల పాత్ర కీలకమని, తడి పొడి చెత్త సేకరణలో మున్సిపల్ కార్మికులకు ప్రజలు సహ కారం అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, 200 కోట్ల తో నూతన హాస్పిటల్ కు నిధుల మంజూరు ఇలా అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నా మన్నారు .పేదల ప్రజల పక్షాన అండగా ఉంటానని, జర్నలు అందరికీ ఇందిరమ్మ డబల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డిఈ ఆనంద్, ఏఈ అనిల్, టిసిఎస్ శ్రీకర్, మాజీ కౌన్సిలర్ దాసరి లావణ్య ప్రవీణ్, సంధ్య కిషోర్, మాజీ వైస్ ఎంపీపీ సురేందర్, నాయకులు నకుమల్ల లక్ష్మి నారాయణ, పోతునుక మహేష్, రాజు, వెన్నెల నరేందర్, భరత్, ఓం ప్రకాష్, దాసరి సుభాష్, అజీజ్, అనిల్, ఆదేవు సత్యం, చారి, వార్డు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ హౌస్‌లో పాల్గొన్న

# అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :** సమాజ అభివృద్ధిలో పోలీసు పాత్ర చాలా ఆదర్శనీయమైన దని మరియు శాంతిభద్రతలను సంరక్షించడంలో వారి పాత్ర స్ఫూర్తి దాయకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానం నుండి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బయలుదేరేముందు వారితో ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోలీసుల యొక్క విశిష్ట తను మరియు సార్థకతను తెలియ పరచడానికి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గౌస్ ఆలాంని అభినందిం చారు.పోలీసుల పాత్ర చాలా విశిష్టమైన దని వారు తీసుకున్నటువంటి చొరవతో సమాజంలో ప్రతి ఒక్కరూ వారి యొక్క కార్యకలాపాలను సజావుగా శాంతి యుత వాతావరణంలో కొనసాగిస్తు న్నారని తెలుపుతూ వారి యొక్క విధులు విధానాలు చాలా సంక్లిష్టమైన వని అన్ని సందర్భాలలో సహాయపడేది వారేనని వారు చెప్పారు.ముఖ్యంగా శాంతిని పరిరక్షించడంలో,చెడు అలవాట్లకు అడ్డుకట్ట వేయడంలో, యువతను ప్రేరేపించడంలో చాలా కీలకంగా వ్యవహరిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని సేవలను కొనియాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనడం బాధ్యత యుతంగా, స్ఫూర్తిదాయకంగా భావిస్తు న్నామని చెప్పారు.చాలా చక్కటి కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన పెంపొందిస్తు జాగ్రూతపరుస్తున్న నగర పోలీస్ కమిషనర్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు.

## లోన్ యాప్స్‌తో మోసపోకండి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** లోన్ యాప్స్ జాగ్రత్తగా ఉండాలని మోసపోకూడదని షీ టీం ఎస్సై లావణ్య అన్నారు.గురువారం రామగుండం సి.పి ఆదేశాల మేరకు,ధర్మారంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం ఇంచార్జ్ ఎస్ ఐ లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. అమ్మాయి లకు ఎలా జాగ్రత్తగా ఉండాలని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు స్నేహలత, మౌనిక, సురేష్ మరియు ప్రిన్సిపాల్ అనంత రామకృష్ణ మరియు ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు అందరూ సహకరించాలి

**మొదటి పేజీ తరువాయి...** జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకుంటున్నారని అన్నారు.డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించేందుకు వినూత్న రీతిలో జిల్లాలో రంగోలి,వాల్ పెయింటింగ్ వంటి కార్యక్రమాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా నిర్మూలించి డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై 27 మంది మహిళలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో సిడిపిఓలు సబిత, నర్సింగరాణి,సుగుణ,శ్రీలత,కమ్యూనిటీ ఎడ్యుకేటర్ తిరుపతి,ఎంబి ఎంఎ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి,మర్రి రాజేందర్ పాల్గొన్నారు.

## గన్నేరవరం పోలీస్ స్టేషన్‌పై ఆకస్మిక తనిఖీ

**-సీసీటీఎన్ఎస్ వినియోగం, పెండింగ్ కేసులపై సీపీ గౌష్ ఆలం ఆదేశాలు**




**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ గురువారం గన్నేరవరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, ఆవరణలోని స్వాధీనం వాహనాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఆయన ు సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సమన్లు, టీఎస్-కాప్, ఈ-సాక్ష్య తదితర సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి పట్టు సాధించి వాటిని విధుల్లో విరివిగా వినియోగించాలని సూచించారు.ఎఫ్ఐఆర్ ఇండెక్స్, పెండింగ్ కేసులపై సమీక్షించి వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టడంతో పాటు స్టేషన్ పరిధి గ్రామాలను సెక్టార్లుగా విభజించి అధికారులను కేటాయించాలన్నారు. కొత్త కానిస్టేబుళ్లు అన్ని విధులను సీనియర్ల ద్వారా అభ్యసించాలని సూచించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిఘా మెరుగు చేయాలని ఆయన ఆదేశించారు.ఈ తనిఖీలో ఎస్సై నరేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి...**తేమ శాతం వచ్చిన మొక్కజొన్న తక్షణమే కొనుగోలు చేయాలని, రైతులకు మద్దతు ధర లభించాలంటే కొనుగోలు కేంద్రాలు ఉంటేనే సాధ్యమవుతుందని,రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా మొక్క జొన్న కొనుగోలు చేయడం పై హర్షం వ్యక్తం చేశారు.గతంలో కేంద్రం నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసిందని,రాష్ట్ర ప్రభుత్వానికి నాఫెడ్ మద్దతుగా ఉంటే అపరిమితంగా కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు.దళారులను నిలువరించేందుకు ప్రభుత్వం మొక్క జొన్న విక్రయించే రైతులు ఆన్లైన్ లో స్లాట్ బుక్ చేసినతర్వాత మార్కెట్‌కు తీసుకువచేలా చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు.మొక్కజొన్న కొనుగోలు పై విధించిన 18 క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని సడలించి,30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాశామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి,నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా కృషి చేయాలన్నారు.ఉత్తర తెలంగాణ జిల్లాలలో మొక్కజొన్న పై అవగాహన పెరిగి,కొయ్య మొక్క సాగు చేస్తుండడంతో పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు,దిగుబడి పెరుగుతుందన్నారు.ఈ మొక్కజొన్న ఎకరానికి 30 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంటే 18 క్వింటాళ్ల కొనుగోలు పరిమితితో రైతులు దళారీల బారిన పడి నష్టపోయే అవకాశం ఉందన్నారు. మొక్కజొన్న కొనుగోలు పై18 క్వింటాళ్ల పరిమితి నిబంధన సడలించాలన్నారు. రైతులు సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచాలని సూచిస్తున్న కేంద్ర ప్రభుత్వం రసాయనిక ఎరువులకు కల్పిస్తున్న రాయితీని సేంద్రీయ ఎరువులకు కల్పిస్తే రైతులు సేంద్రీయ ఎరువులు వైపు మల్లె అవకాశం ఉంటుందన్నారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు.అమెరికాతో ఒప్పందంలో భాగంగా మొక్క జొన్న దిగుమతి చేసుకునేందుకు సుముఖంగా ఉన్నట్లు పత్రికల్లో చూశానని, విదేశాల నుండి మొక్కజొన్న దిగుమతి చేసుకుంటే, స్థానికంగా మొక్కజొన్న డిమాండ్ పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.మొక్కజొన్న కొనుగోలు ఎకరానికి 18 క్వింటాళ్ల కొనుగోలు సడలించాలని కోరుతూ రాసిన లేఖను మార్కెట్ కార్యదర్శికి అందజేసి,ఈ విషయాన్ని ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.ఈకార్యక్రమంలో నాయకులు జున్నురాజేందర్,అల్లాల రమేష్ రావు,ధరా రమేష్ బాబు, మంజుల రఘువీర్ పాల్గొన్నారు.

# లక్ష్యం రూ.లక్ష కోట్ల పెట్టుబడులు...

**మొదటి పేజీ తరువాయి...** ఉందన్నారు. గత 20 నెలల కాలంలో కొత్తగా రూ.3.2 లక్షలకోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ఇందులో లైఫ్ సైన్సెస్ రంగం వాటా రూ.63వేల కోట్లు అని చెప్పారు.లైఫ్ సైన్సెస్ ఎగుమతులు గతేడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలోనే రూ.26వేల కోట్ల మార్కును దాటాయన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం ఆర్థిక వ్యవస్థ విలువను ప్రస్తుతం ఉన్న 80 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే “కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ” ని అందుబాటులోకి తెస్తామన్నారు.

**భారత్ నుంచి హైదరాబాద్ మాత్రమే....**

ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ రూపొందించిన ‘గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ 2025’లో ప్రపంచంలోని అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో హైదరాబాద్ కు చోటు దక్కిందన్నారు. బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, కేంబ్రిడ్జ్, బీజింగ్, టోక్యో సరసన మన నగరం నిలిచిందన్నారు.ఈ జాబితాలో భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే అని అన్నారు. లైఫ్ సైన్సెస్ ఆఫీస్ లీజింగ్ 2022లో 0.6 మిలియన్ చదరపు అడుగులు ఉండగా...2024లో ఏకంగా నాలుగు రెట్లు పెరిగి 2.4 మిలియన్ చదరపు అడుగులకు చేరిందన్నారు. లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్, ఇతర అంతర్జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో రాబోయే “బయో-డిజిటల్” యుగానికి కావాల్సిన అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు.

**మా నినాదం “ఇన్వెంట్ ఇన్ తెలంగాణ”...**

మా నినాదం మేడిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన “ఎకో సిస్టం” తెలంగాణ బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేస్తుందన్నారు. జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్, బీ హబ్, భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల, ప్రోత్సాహకర విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులు, అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్ , దేశంలోనే సాటి లేని స్టెమ్ టాలెంట్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, ఎక్కడైనా సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

**ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి....**

సెల్ అండ్ జీన్ థెరపీ, బయోలాజిక్స్ అండ్ బయోసిమిలర్స్, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు, కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్, డయాగ్నస్టిక్స్, మెడ్‌టెక్, ఏఐ ఆధారిత డిజిటల్ హెల్త్ , హెల్త్‌టెక్, ఏపీఐ బల్క్ డ్రగ్ ఉత్పత్తి, ఫార్మా ప్యాకేజింగ్, గ్లాస్ ట్యూబింగ్, ట్రాన్స్‌లేషనల్ బయోటెక్ రీసెర్చ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, జీనోమిక్స్ , గ్రీన్ బయో మాన్యుఫ్యాక్చరింగ్,అగ్రి బయోటెక్, యానిమల్ హెల్త్ తదితర రంగాల్లో తెలంగాణ లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆస్ట్రేలియా కంపెనీలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సదస్సు “విక్టోరియా%-%తెలంగాణ ఇన్నోవేషన్ కారిడార్” కు నాంది పలకాలని ఆకాంక్షించారు. రాబోయే ఫిబ్రవరిలో హైదరాబాద్ లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని దిగ్గజ లైఫ్ సైన్సెస్ పరిశ్రమలను ఆహ్వానించారు. కార్యక్రమంలో విక్టోరియా రాష్ట్ర మంత్రులు రోస్ స్పెన్స్, డానీ పియర్సన్ ఎంపీ, ఆస్ బయోటెక్ ఛైర్మన్ డా. జేమ్స్ క్యాంప్‌బెల్, తెలంగాణ ఇన్వెస్ట్మెంట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన మద్యం దరఖాస్థులు 3. లక్షల రుసుమే కారణమా...!

**-ముగిసిన దరఖాస్థుల గడువు**

**-27 న తేలనున్న దరఖాస్తు దారుల భవితవ్యం**

**-ధర్మపురి సర్కిల్ దరఖాస్థుల్లో వెల్గటూర్ షాప్ టాప్**

**చురకలు, విలేఖరి,వెల్గటూర్, అక్టోబర్ 23 :** రాష్ట్ర అబ్కారి శాఖ ఆధ్వర్యం లో కొత్త మద్యం షాప్ ల కోసం స్వీకరిస్తున్న దరఖాస్తుల ప్రక్రియ మొదట మందకొడిగా సాగినప్పటికి అక్టోబర్ 18 చివరి రోజుగా నిర్ణయించడంతో మద్యం షాప్ వ్యాపారులు పెద్దఎత్తున దరఖా స్తులు చేసుకున్నారు.అయినా గతంలోకంటే దరఖాస్తులసంఖ్య కొంత తగ్గింది. అక్టోబర్ 18 రాష్ట్ర బీసీ బంద్ ప్రభావంతోకొన్నిచోట్ల బ్యాంకులు పనిచేయని కారణం గా కొంత మంది దరఖాస్తులు చేసుకోలేకపోవడంతో తిరిగి మద్యం ధరఖాస్థుల స్వీకరణ గడువు ఈ నెల 23 వరకు అబ్కారి శాఖ పొడగించిన విషయం తెలిసిందే, గతంలో కంటే దరఖాస్థులు వచ్చినప్పటి కి దరఖాస్తు రుసుము 2 లక్షల కు బదులు ఈ సారి 3 లక్షలుగా నిర్ణయించడంతో దరఖాస్తులు తగ్గినా ఖజానాసమకూరనుంది. ఇదిలాఉంటే జగిత్యాల జిల్లా ధర్మపురి అబ్కారిసర్కిల్ పరిధి లో 14 షాపుల్లో ఈసారి (45) గెజిట్ నంబర్ వెల్గటూర్ షాప్ కు 60 దరఖాస్తులు దాటి టాప్ గా నిలిచింది.ఈ షాప్ కు గతం లో 65 దరఖాస్తులు వచ్చాయి. అలాగే గతంలో ఎండపల్లి, గోపులాపూర్ షాపులకు అధికం గాదరఖాస్తులు వచ్చినా ఈసారి వెనుకబడ్డాయి.ధర్మపురి సర్కిల్ లో ఈ నెల 18 వరకు ధర్మపురి (33)షాప్ కు గతంలో 53 దర ఖాస్తులు రాగా ప్రస్తుతం 28,దర ఖాస్తులు, ధర్మపురి (34)పైగతం లో 50,ప్రస్తుతం 29.ధర్మపురి (35)పై గతంలో 36,ప్రస్తుతం, 34.గొల్లపల్లి (36) పై గతంలో 76,ప్రస్తుతం 50.గొల్లపల్లి (37) పై గతంలో 75,ప్రస్తుతం 42. రాజా రాంపల్లి (38) పై గతంలో 60, ప్రస్తుతం37.ఎండపల్లి(39) పై గతంలో 67,ప్రస్తుతం 28. బీర్పూర్ (40) పై గతంలో 14, ప్రస్తుతం18.బీర్పూర్ (41) పై గతంలో 46,ప్రస్తుతం 21. గోపులాపూర్ (42) పై గతంలో 69,ప్రస్తుతం 40.సారంగాపూర్ (43)పై గతంలో 12,ప్రస్తుతం 11. సారంగాపూర్ (44) పై గతంలో 44,ప్రస్తుతం 17.వెల్గటూర్(45) పై గతంలో 65 ప్రస్తుతం 60. కొత్తపేట (46) పై గతంలో 30,ప్రస్తుతం 17 దరఖాస్తులు వచ్చాయి.మొత్తం దరఖాస్తులు గతంలో 697 దరఖాస్థులు వస్తే, ప్రస్తుతం 432 దరఖాస్తులుమాత్రమేవచ్చాయి. ప్రభుత్వం దరఖాస్తు గడువు ఈనెల 23కు పెంచడంతో గురువారం గడువు ముగిసే సమయానికి మరో 20 కి పైగా ధరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది.గతంలో ధర్మపురి సర్కిల్ లో దరఖాస్తుల ద్వారా సమకూరిన రుసుముకంటే ప్రస్తుతం కొంత తగ్గినట్లు తెలు స్తుంది. ధరకాస్తు రుసుము 3, లక్షలుగా నిర్ణయించడం వల్లనే దరఖాస్థుల సంఖ్య తగ్గిందని చెప్పవచ్చు.ఈనెల 27న, నిర్వ హించే లక్కీ డ్రా లో షాప్ లు ఎవరికి దక్కనున్నాయో,ఎవరిని అదృష్టం వరించునుందో తేలనుంది.

# సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



**చురకలు విలేకరి, వెల్గటూర్, అక్టోబర్ 23 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని ముత్తునూర్ ముక్తేశ్వర ఎత్తి పోతల పథకంలో పైప్ లైన్ల రిపేయర్ కోసం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ తో రూ.81 లక్షల నిధులను సర్కారు మంజూరు చేయడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ముత్తునూర్, రాంనూర్,గ్రామాల రైతుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ముత్తునూర్ గ్రామంలోని ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం పంపు హౌస్ పైప్ లైన్ల రిపేర్ పనులు ఉన్నాయని గత కొద్దిరోజుల క్రితం రాష్ట్ర సంక్షేమ శాఖ లక్ష్మణ్ కుమార్ దృష్టి తీసుకెళ్లగా వెంటనే స్పందించి ప్రత్యేక దృష్టితో ఎత్తిపోతల పథకం రిపేయర్ కోసం రూ.81లక్షల మంజూరు చేయించడం హర్షనీయం అని పేర్కొన్నారు. ఈ ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ పైపు లైన్లు రిపేర్ చేయడం ముత్తునూర్,రాంనూర్,గ్రామాలకు చెందిన సుమారు 1632 ఎకరాలకు సాగు నీరు ద్వారా రైతులకు మేలు చేకూరతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్, ఏఎంసి వైస్ ఛైర్మన్ గొల్ల తిరుపతి, మాజీ ఎంపిటిసి అనుమాల మంజుల,కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ పుదరి రమేష్, మాజీ ఉప సర్పంచ్ సందీప్ రెడ్డి, భైరం రెడ్డి, ముక్తేశ్వరా ఎత్తిపోతల సాగునీటి సహకార సంఘ చైర్మన్ గొల్ల రాజలింగు,మాజీ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి,గాదాసు పోచయ్య, సప్ప లింగయ్య, గాజుల విజయ్,శ్రావణ్ రెడ్డి, గెల్లు శ్రీను,మన్నే జితేందర్, వెలగందుల సంతోష్, నారాయణ, శ్రీధర్, ఆశయ్య, రామిండ్ల లక్ష్మణ్, బోడుక గంగయ్య, ఎనగందుల నరేష్, మేడి మల్లేష్, భూమయ్య, గొల్ల రాజయ్య, సంఘ తిరుపతి, బోర్ ఆశక్క, సంఘ అమృత,సింగం భూమక్క, తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



**చురకలు ప్రతినిధి, కోరుట్ల అక్టోబర్ 23 :** పేద మధ్య తరగతి ప్రజలకు అనారోగ్య సమస్యల కారణం గా ఎదురయ్యే ఇబ్బందుల్లో తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోందని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో కోరుట్ల నియోజక వర్గానికి చెందిన 139 మంది లబ్ధిదారులకు రూ.46,90,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య వైద్యం క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గత 20 నెలల్లో రాష్ట్రవ్యాప్తం గా సుమారు రూ.4.70 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు వైద్య సహాయం అందించబడింది అని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై మాట్లాడు తూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి పనుల ప్రగతికి అనుగుణంగా నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమవు తున్నాయి అని పేర్కొన్నారు. అతను మరింతగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోంది. ఇది నిజమైన ప్రజా ప్రభుత్వం. రేషన్ కార్డుల మంజూరు సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు పేదలకు ఊరట కలిగిస్తు న్నాయి. ప్రజలందరూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మండల అధ్యక్షులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వైభవంగా యమద్వితీయ పూజలు





**చురకలు విలేకరి, ధర్మపురి, అక్టోబర్ 23 :** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయమైన యమధర్మరాజు ఆలయంలో గురువారం యమద్వితీయ పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. యమద్వితీయ పురస్కరించుకొని స్వామివారికి రుద్రాభిషేకం, మన్య సూక్తం,ఆయుష్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం హారతి మంత్ర పుష్పం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో దేవస్థానం కార్యనిర్వహణా ధికారి సంకటాల శ్రీనివాస్,దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్,సభ్యులు ఎదులాపురం మహేందర్,బొల్లారం పోచయ్య ,స్తంభం కాడి గణేష్,గుడ్ల రవీందర్,రాపర్తి సాయికిరణ్,వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ,పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకు లు నేరెళ్ల సంతోష్‌కుమార్, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్,బొజ్జ సంతోష్ కుమార్ ,బొజ్జ సంపత్ కుమార్,బొజ్జ రాజ గోపాల్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ముగిసిన జగిత్యాల

# జిల్లా స్థాయి క్రీడా పోటీలు



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 23 :** జిల్లా కేంద్రం లో నిర్వహిస్తున్న మై భారత్ (మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ హోమ్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) డిస్ట్రిక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ గురువారం ముగి సాయి. ముఖ్య అతిథులుగా జగిత్యాల జిల్లా చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కోఆర్డినే టర్ భూమేష్ హజారై స్వామి వివేకా నంద చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో వెల్గ టూర్ జట్టు ప్రథమ స్థానంలో, గొల్లపెల్లి ద్వితీయ స్థానంలో, కబడ్డీ విభాగంలో బీర్పూర్ ప్రధాన స్థానంలో, ధర్మపురి ద్వితీయ స్థానంలో నిలిచాయి. మహిళా విభాగం కబడ్డీ తాటిపెల్లి ప్రధాన స్థానంలో,జగిత్యాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ మధు,చందు పరుగు పందెంలో అభి, అరవింద్ షాట్ పుట్లో మనోహర్,సాయి విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన వారికి జగిత్యాల జిల్లా చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ భూమేష్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మైభారత్ జగిత్యాల జిల్లా వాలంటరీ మారం గణేష్,ఎన్ఎస్ఎస్ వింగ్ తిరుపతి,మధులిక,పీఈడీలు, ఆర్గనైజర్స్ రవితేజ,హరీష్,ఆదిత్య, చందు,సాగర్,మధు పాల్గొన్నారు.

## బోర్‌కు మరమ్మత్తులు



**చురకలు విలేకరి, బీర్పూర్,అక్టోబర్ 23 :** బీర్పూర్ మండల కేంద్రంలోని ఒడ్డెరకాలనీలో గల నీటి బోర్ గత నెల రోజులుగా చెడిపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ వార్డు సభ్యులు అల్లెపు లింగన్న గురువారం నీటి బోర్కు తన స్వంత ఖర్చులతో మరమ్మత్తులు చేయించి నీటి సరఫరా అయ్యేలా చేశారు. బోరు మరమ్మత్తులు చేయించిన లింగన్నకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




**చురకలు విలేకరి, జగిత్యాల,అక్టోబర్ 23 :** న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఇంటర్ స్కూల్ పోటీలలో జగిత్యాల పట్టణానికి చెందిన అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. అకాడమిక్స్, కల్చరల్, స్పోర్ట్స్ లోని వివిధ విభాగాలలో విద్యార్థులు పతకాలు సాధించారు. చెస్ లో 2, తైక్వాండోలో 2, మ్యూజిక్ లో 6 మరియు ఇంగ్లీష్ ఎక్స్‌ప్లోర్ విభాగంలో 1 గోల్డ్ మెడల్ మొత్తంగా 10 గోల్డ్ మెడల్స్, 16 సిల్వర్ మెడల్స్, 13 బ్రోన్జ్ మెడల్స్ సాధించారు. వివిధ రాష్ట్రాల నుండి 1200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ఈవెంట్ లో జగిత్యాల అకాడమిక్ హైట్స్ పాఠశాలకు చెందిన 54 మంది విద్యార్థిని విద్యార్థులు చెస్, మ్యూజిక్, అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, సైన్స్ క్విజ్, జి కే, స్పెల్లిన్, లాంగ్వేజ్ స్కిల్స్, ఫైన్ ఆర్ట్స్, డాన్స్ వంటి విభాగాలలో పాల్గొన్నారు. 54 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా 39 మంది విద్యార్థులు పతకాలు సాధించి జగిత్యాల పేరును జాతీయ స్థాయిలో ఘనంగా చాటిచెప్పారు. విజేతలకు ఒలింపిక్స్ పతక విజేత, పద్మశ్రీ బజరంగ్ పూనియా బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## బయోమైనింగ్ పనులను పరిశీలించిన కమిషనర్



**చురకలు విలేకరి,మెట్‌పల్లి, అక్టోబర్ 23 :** మెట్‌పల్లి పట్టణంలోని డంపింగ్ యార్డులను గురువారం మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ సందర్శించి అక్కడ జరుగుతున్న బయోమైనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేంపేట రహదారిలో గల పిచ్చి మొక్కల తొలగింపు పనులను పరిశీలించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ బయోమైనింగ్ పనుల్లో భాగంగా 15 శాతం చెత్తను రీసైకిలింగ్ చేశామని, ప్లాస్టిక్కు వేరు చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ఎరువుగా తయారు చేసి నాటిన మొక్కలకు, నర్సరీల్లోని మొక్కలకు వినియోగిస్తున్నామని వెల్లడించారు. పట్టణాన్ని పరిశు భ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, మురికి కాలువల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ నాగేశ్వరరావు, సానిటరీ ఇన్స్ పెక్టర్ అక్షయ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పసుపు పంటకు చీడ పీడల బెడద...!

**-పంట దిగుబడిపై అన్నదాత దిగులు**
**-అధికారుల సూచనల మేరకు మందులు వాడాలి**
**-పసుపు క్వింటాలు రూ.15 వేలు ధర కోసం రైతుల డిమాండ్**





**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అక్టోబర్ (23) :** ఇటీవల ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వానలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా పసుపు పంటపై తీవ్ర ప్రభావం పడింది. అప్పుడే వివిధ రకాల చీడపీడలు ఆశించిన పంట దిగుబడి తగ్గించే ప్రమాదం ఎక్కువగా పొంచి ఉండడంతో పసుపు పంటసాగు చేసిన రైతులు ఆవేదనకు లోనవు తున్నారు. వాతావరణంలో తేమకురిసిన వానలతో చీడపీ డలు పంటలు ఆశించేందుకు ఎక్కువగా అవకాశం ఉం టుంది. దీనివల్ల పసుపులో దుంప వేళ్ల కుల్లు, మర్రి ఆ కుతెగులు, ఆకుమచ్చ తెగులు, సూక్ష్మపోషకలోపాలతో పంటకు తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రతి వానాకాలం సీజన్ ప్రారంభంలో పసుపు తోడుగా మొక్కజొన్న పం టలను అంతర పంటలుగా రైతులు సేద్యం చేస్తారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ లోనూ పసుపు పంటను అది కవిస్తీర్ణంలో రైతులు సాగు చేశారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి డివిజన్ పరిధిలోని ఇబ్రహీం పట్నం,మల్లాపూర్,మెట్‌పల్లి మండలల్లో సుమారు 8వేల ఎకరాల్లోపసుపు పంటలు సాగు చేశారు.పసుపులో అంతర పంటగా వేసిన మొక్కజొన్న పంట దిగుబడి గత కొద్ది రోజుల క్రితం దిగుబడి అయింది.మొక్కజొన్న పంట దిగుబడితో పసుపు పంటపై ఎండ వేడిమి లేదా వాతావరణ పరిస్థితుల ప్రభావం నేరుగా పడుతుంది.తత్ఫలి తంగా తెగుల్లు పసుపు పంటను ఆశిస్తాయి.ప్రాథమిక దశలోనే సాగు రైతులు తమ పంట బూములను గుర్తించి అందుకు అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టినట్లయితే పం టసంరక్షించేందుకు అవకాశం ఏర్పడుతుంది.దీంతోది గుబడి పెరుగు తుంది.కాగా నిజామాబాద్ మార్కెట్ యార్డులో ప్రస్తుతం 12 వేలు మొదలు 13వేల వరకు ధర క్వింటాల్ పలుకు తోంది.ఇప్పటికే గతసంవత్సరం ,కరిద్ దారులు నిల్వ ఉంచిన పసుపు ప్రస్తుతం మార్కె ట్లో విక్రయాలు చేస్తే క్వింటాల్ పసుపుకు 5వందలు నష్టం జరగనుంది .ధర వస్తే తప్ప చేసేది ఏమి లేదని వ్యాపారులు తీవ్రఆందోళనలో ఉన్నారు. రైతులు ఇప్పటికే పండించిన పంటలో సగానికి రోగం రాగా సగం పంటనే చేతికొస్తుందని పసుపు క్వింటాలు 15వేల మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాలను రైతులు,వ్యాపారులు కోరుతున్నారు.

**దుంప వేరుకుళ్లు తెగులు..**

దుంపవేరుకుళ్ల తెగులును కొమ్ముకుళ్లు,అడుగు రోగం అని కూడా పిలుస్తారు.ఈ తెగులు సోకితే నష్టం ఎక్కు వగా సంభవిస్తుంది.దిగుబడి కనీసం 50శాతం నుంచి 60శాతం వరకు తగ్గుతుంది.అక్టోబర్,నవంబర్ నెలలో దీని ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది.

**పంటకు నష్టం కలిగే కారణాలు..**

విత్తనశుద్ధి చేయకపోవడం, విత్తన పసుపు లోతుగా నాటడం, మురుగునీరు పోయే సౌకర్యం ఏర్పాటు చేసుకో కపోవడం,ఎడతెరపి లేని వర్షాలతో మక్కల చుట్టూ నీరు నిలిచి ఉండడం, పోటాష్,వేప పిండి ఎరువులు సక్ర మంగా వాడకపోవడం.

**లక్షణాలు..**

వంటలో అక్కడక్కడ మొక్కలు ఎదగకపోవడం,లేదా ఆ పురుగు సోకి మొక్క రంగు మారడం,ఆకులు వాడి పోయినట్లు ఉంటాయి.మొక్కల్లో మొట్ట మొదటిగా ముదురు ఆకు వాడిపోయి గోధుమరంగుగా మారి ఎండి పోతాయి.తరువాత మొక్కపై ప్రభావం పడి ఉన్న ఆకులకు తెగులు వ్యాప్తి చెంది మచ్చలు ఏర్పడతాయి. తరు వాత గోధుల రంగులో మొక్కలు మారి వాడిపోతాయి.లోపల దుంప కుల్లిపోయి చెడు వాసన వస్తుంది. లోపల పురుగు బదులు మట్టి రంగు ఉంటుంది.దీంతో తల్లి దుంల నుంచి పురుగు చేరి పంటనునాశనం చేస్తుంది. దీంతో పసుపు దిగుబడి నాణ్యత తగ్గుతుంది.

**పంట తెగులు బారిన పడి దిగుబడి పైన ఆశపోయింది..**
**- అరె రమేశ్ రైతు**



పసుపు పంట వేసే క్రమంలో విత్తన శుద్ధి చేసే పంటకు కావాల్సిన ఎరువు వేసిన ప్రస్తుతం పంట చేతికొచ్చే క్రమంలో ఆకు తెగులు,దుంప తెగులురా వడంతో పంట పైన ఆశ పోయింది.దగుబడి సగం వచ్చేలా ఉంది.

**పసుపు క్వింటాలు15 వేల మద్దతు ధర కల్పించాలి..**
**- రాదారపు దేవదాసు రైతు**



పసుపు క్వింటాలు 15 వేల మద్ద తు ధర ఉంటే రైతుకు లాభదాయకం అవుతోంది.ప్రస్తుతం 11వేల నుండి 12 వేలు ఉంది ఎకరాకు పంటకు అయ్యే 90 వేల ఖర్చుతో రైతు ఎలా పంటలు పండించాలి. ప్రభుత్వాలు స్పందించి ధర పై కనీస ధరలు వచ్చేలా చూడాలి.

**అధికారుల సూచనల మేరకు మందులు వాడాలి**
**మండల వ్యవసాయ శాఖ అదికారి అకు రాజ్ కుమార్**



పసుపు పంటలో నీళ్ళు వెంట వెంటనే వెళ్లె విధంగా కాలువలు ఏర్పా టు చేసుకోవాలి.బెడ్స్‌పైన పసుపు సాగు చేయాలి.ప్రస్తుతం మర్రి ఆకు తెగులు, దుంప తెగులు,దుంప ఈగ ఆశించే అవకాశం ఉంటుంది.రైతులు ఆశించిన తెగులు నిబట్టి ఉద్యానశాఖ అధికారుల ను,వ్యవసాయ శాఖ అధికారుల సూచన ల మేరకు మందులు వాడాలి.విచక్షణ రహితంగా మందులు వాడటం వల్ల లాభం లేకపోగా పెట్టుబడి పెరిగి పంట నష్టపోయే అవకాశం ఉంది.

# ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 23 :** విద్య హక్కు చట్టంలోని సెక్షన్ 23 (2) ను సవరించి ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని జగిత్యాల జిల్లా పిఆర్టియు టిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డిలు అన్నారు. గురువారం పెగడపెల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బతికేపల్లిలో ఈ నెలలో పదవి విరమణ పొందుతున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అల్లాడి భారతి సన్మాన మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై వారిని సన్మానిం చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్య హక్కు చట్టం అమలు కాకముందు 2010 కు ముందు నియామకమైన ఉపాధ్యా యులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం విద్య హక్కు చట్టాన్ని సవరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సులోచన, పెగడపెల్లి ప్రధానోపాధ్యాయులు లలిత, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నాగరాణి,



పిఆర్ టియు టిఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మునీందర్, శ్రీధర్, పంచాయితీ రాజ్ ఉపాధ్యాయ మాస పత్రిక సంపాదక వర్గ సభ్యులు అబ్దుల్ జమీల్, రమేష్, నరేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన జువ్వాడి నర్సింగరావు



**చురకలు ప్రతినిధి కోరుట్ల,అక్టోబర్ 23 :** కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన నూతిపల్లి ముత్తమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు గురువారం అందజేశారు.ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సహాయంలో అండగా నిలుస్తున్నారు. ప్రతి అర్హుడికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు.ప్రతి సీఎంఆర్ఎఫ్ దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి,లబ్ధిదారులకు చెక్కులు త్వరితగతిన అందేలా కృషి చేస్తున్న కోరుట్ల నియోజకవర్గ రథసారధి నర్సింగరావుకి హాజరైన గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష,జరిమానా

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23 :** వరకట్న వేధింపులు, చంపుతామని బెదిరించిన కేసులో నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెంకట్ మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ గురువారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమలకుంట గ్రామానికి చెందిన లక్ష్మికి గంగాధర మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ తో వివాహమైంది. శ్రీనివాస్ అదనపు కట్నం కోసం తన భార్య లక్ష్మిని వేధింపులకు గురి చేస్తుండేవాడు. 2019 సెప్టెంబర్ 5న లక్ష్మి తన పిల్లలతో తన తల్లి ఇంట్లో ఉండడం గమనించిన శ్రీనివాస్ అక్కడికి చేరుకొని లక్ష్మి, వారి పిల్లలపై కిరోసిన్ పోసి చంపడానికి ప్రయత్నించాడు. దీంతో లక్ష్మి పెగడపల్లి పోలీస్ స్టేషన్లో తన భర్త శ్రీనివాస్ తో తనకు తన పిల్లలకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడైన కోరేపు శ్రీనివాస్ ను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా అతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వెంకట్ మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ మూడేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన పిపి నర్సయ్య, ఎస్ఐ నవత, సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ హరీష్, సిఎంఎస్ కానిస్టేబుల్ త్రివేణ్, కిరణ్ కుమార్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## కోరుట్లలో గంజాయి మొక్కల పెంపకం

**-ముగ్గురు ఉత్తరప్రదేశ్ వ్యక్తుల అరెస్ట్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 23 :** బుధవారం సాయంత్రం సుమారు ఆరు గంటల సమయంలో కోరుట్ల పట్టణంలోని హాజీపూర్ ఏరియాలో గంజాయి మొక్కలను పెంచుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.కోరుట్ల ఎస్సై ఎం. చిరంజీవి కి నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు హాజీపూర్ ఏరియా కు చేరుకుని ఎస్కే చాంద్ అనే వ్యక్తి కాలి స్థలంలో తుమ్మ చెట్ల మధ్య ఒక ఖాళీ డ్రమ్ములో గంజాయి మొక్కలను పెంచుతున్న ముగ్గురు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తులను పట్టుకున్నారు.

**అరెస్టైనవారు :**

1. భోలా శంకర్ (27), తండ్రి . బాబు లాల్, కులం: మౌర్య, ఆర్/ఓ. దామన్ గంజ్, మిర్జాపూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 2. కైలాష్ కుమార్ అప్ప (29), తండ్రి . లాలు, కులం: టాకురియా, ఆర్/ఓ దామన్ గంజ్, మిర్జాపూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 3. సాని ఏ సన్నీ (26), తండ్రి. దయ శంకర్, కులం: టాకురియా, ఆర్/ఓ దామన్ గంజ్, మిర్జాపూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం.వారి వద్ద నుండి సుమారు రూ.90,000 విలువైన 9 గంజాయి మొక్కలను, అలాగే రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యను ఇద్దరు వి ఆర్ ఎ లు వ్యవసాయ అధికారి నాగమణి సమక్షంలో నిర్వహించారు.తరువాత అరెస్టు చేసిన ముగ్గురిని గురువారం రిమాండ్‌కు తరలించారు.ఎవరైనా గంజాయి పండించినా అమ్మినా లేదా కొనుగోలు చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం అని కోరుట్ల సీఐ బి. సురేష్ బాబు హెచ్చరించారు.

# వరికోతల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి

**-ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**
**-జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23 :** వరికోతల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్. లత అన్నారు. జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశం మందిరంలో గురువారం వరి కోత యంత్రాల (హార్వెస్టర్ల) యజమానులు, డ్రైవర్లు, సంబంధిత సిబ్బంది, వ్యవసాయ అధికారులు, ఏడిఏలతో అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, జిల్లా రవాణా అధికారి ఎం.శ్రీనివాస్ పాల్గొని రైతులకు,హార్వెస్టర్ యజమానులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత మాట్లాడుతూ వరికోత సమయంలో నాణ్యమైన ధాన్యం సేకరణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,హార్వెస్టర్ యంత్రాలను సక్రమంగా నిర్వహించి నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు.హార్వెస్టర్ యజమానులు రైతుల వద్దకు సమయానికి చేరి సహకరించాలని,యంత్రాల అద్దె రేట్లు పారదర్శకంగా ఉండేలా చూడాలని అదనపు కలెక్టర్ బి.ఎస్ లత సూచించారు.అనంతరం డీఏఓ భాస్కర్ మాట్లాడుతూ హార్వెస్టర్ యజమానులు పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కోత ప్రారంభించాలని, మెషిన్లోని బ్లోయర్ సక్రమంగా ఆన్లో ఉంచాలని, ఆర్పిఎం 19-20 కంటే తక్కువగా ఉండకూడదని సూచించారు. ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,కోత అనంతరం శుభ్రపరచిన ధాన్యాన్ని వేరు చేసి నిల్వ చేయాలని, ధాన్యంలోని తేమ 17శాతం లోపే ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని వివరించారు. అనంతరం డీటీఓ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ హార్వెస్టర్ యంత్రాల రవాణా సమయంలో రోడ్డు రవాణా నిబంధనలు తప్పక పాటించాలని, డ్రైవర్లు లైసెన్స్ మరియు వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.అధికారులు రైతులు,యజమానులు పరస్పర సహకారంతో కోత సజావుగా నిర్వహించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# బీర్‌పూర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

**-దేవాలయాల్లో రాజకీయాలకు స్థానం లేదు**
**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు విలేకరి, బీర్ పూర్, అక్టోబర్ 23 :** బీర్ పూర్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని, దేవాలయాల్లో రాజకీయాలకు స్థానం లేదని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. గురువారం బీర్పూర్ శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అంతకుముందు శ్రీ లక్ష్మీ నర్సింహస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని,అనునిత్యం ప్రజల్లో ఉండి బీర్పూర్ మండల అభివృద్ధికి కృషి చేస్తున్నాన్నారు. దేవస్థానాల్లో రాజకీయాలకు స్థానం లేదని, రాజకీయాలకు అతీతంగా అందరికి అందుబాటులో ఉంటూ నిత్యం సేవ చేస్తానన్నారు.కుల,మత రాజకీయాల విషయంలో ప్రజలు ఆలోచన చేయాలని,బీర్పూర్ శ్రీలక్ష్మి నర్సింహస్వామి అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు.టూరిజం శాఖ మంత్రితో మాట్లాడి రూ. 1కోటి నిధుల మంజూరు అయ్యేలా చూస్తానని,తన వంతుగా రూ. 1లక్ష విరాళాన్ని అందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కెడిసిసి జిల్లా సభ్యులు ముప్పాల రాంచందర్రావు, ఈవో శ్రీనివాస్, ఆలయ నూతన ట్రస్టు సభ్యులు చేర్నేని శ్రీనివాస్, యశోద రమేష్, గుమ్మడి రమేష్, పూదూరి గంగమని, చల్ల లక్ష్మణ్, దేవన పెల్లి జగన్మోహన్, చెక్కపల్లి సత్తన్న, చల్ల లక్ష్మణ్, ఎనిగంటి సతీష్, చెట్టుపల్లి సత్యనారాయణ, చెన్న గంగాధర్, స్మార్ట్, భీమనాతి లవన్, అల్లెపు సురేందర్, మండల నాయకులు, తాజా మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజెన్ల హక్కుల రక్షణకు కృషి

**-సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్**




**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 23 :** సీనియర్ సిటిజెన్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో టాస్కా జిల్లా స్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర సంఘానికి ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నికయిన మాజీ మున్సిపల్ చైర్మన్ జీ. ఆర్. దేశాయ్ కి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గా ఎన్నికయిన రిటైర్డ్ తహసీల్దార్ పి. హన్మంత్ రెడ్డి లకు పౌర సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సమస్యల పరిష్కారం, సంక్షేమము కోసం ప్రత్యేకంగా సీనియర్ సిటిజెన్స్ కమిషన్ వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆ కమిషన్ చైర్మన్గా తమ రాష్ట్ర అధ్యక్షులు పి. నర్సింహా రావును నియమించాలన్నారు.వృద్ధ తల్లిదండ్రులను నిరాదరించే ఉద్యోగుల వేతనాల లో నుంచి ప్రతి నెల 10శాతం మినహాయించి ఆ తల్లిదండ్రులకు అందజేసేలా చట్టం తెస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాతం, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎం. డీ. యా కూబ్, కోశాధికారి వెల్ ముల ప్రకాష్ రావు, ఆర్గనై జింగ్ కార్యదర్శులు పి. అశోక్ రావు, కే. సత్యనారాయణ,పట్టణ అధ్యక్షులు మానాల కిషన్, బీసీ మహిళా జేఏసి అధ్యక్షురాళ్లు కస్తూరి శ్రీమంజరి, గంగము జలజ, సీనియర్ సిటిజన్స్ మహిళా కార్యదర్శి బి. కరుణ, మండల అధ్యక్షురాలు రాధ, మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు కొక్కుల అంజనేయులు,మైనారిటీ నేతలు జాఫర్, యాకూబ్ హుస్సేన్, సయ్యద్ యూసుఫ్, వజీర్, ఉమ్మడి జిల్లా విద్యార్థి జేఏ సీ అధ్యక్షులు ధోనూరి భూమాచారి, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 23 :** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పోలీస్ అమరవీరుల సంస్మరణలో (పోలీస్ ఫ్లాగ్ డే) భాగంగా విద్యార్ధిని విద్యార్థులకు గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై, పోలీస్ శాఖ పనితీరు, వైర్లెస్ సెట్ ద్వారా మాట్లాడే విధానం, పోలీసు లాకప్, ఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ విధానం, సీసీ కెమెరాల పనితీరు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేసే విధానం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టాలు, డయల్ 100 సేవలు, రిసెప్షనిస్ట్ పనితీరు, 24 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండే డిపార్ట్మెంట్ పోలీస్ డిపార్ట్మెంట్ అని, పాత నేరస్తులను గుర్తుపట్టడానికి ఫింగర్ ప్రింట్ ద్వారా గుర్తించడం లాంటి వివిధ అంశాలపై, పోలీసు ఆయుధాల పనితీరు, సంఘవిద్రోహ శక్తుల చేతిలో చనిపోయిన పోలీస్ అమరవీరులు గురించి, భరోసా సెంటర్, షి టీమ్ పోలీసులు, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో సమాజంలో జరుగుతున్న పరిణామాల పై అవగాహన పెంచుకోవాలని, విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి,అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది, దాని పని విధానం ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో వివిధ పోలీస్ స్టేషన్ల లో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఊడిన బస్సు టైర్..తప్పిన ప్రమాదం...



**చురకలు విలేకరి, ధర్మపురి,అక్టోబర్ 23 :** ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు వెనక టైరు ఊడిపోయింది. ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న బస్సులో సామర్థ్యానికి మించి సుమారు 100కు పైగా ప్రయాణికులు ఉండటం టైర్ ఊడడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది డ్రైవర్ ప్రమాదం సంభవించలోపే పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.దీనితో ప్రయాణికులు ఊపిరి తీసుకున్నారు.ఈ ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటివి జరగకుండా ఎప్పటికప్పుడు బస్సులు పరీక్షించాలని కోరుతున్నారు.

## అమరుడి కుటుంబానికి పండ్ల అందజేత



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 23 :** పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా సుమారు 20 సంవత్సరాల క్రితం మావోయిస్టుల చేతిలో మృత్యువాత శ్రీనివాస్ రావు అనే హోం గార్డు ఎల్లారెడ్డిపేటలోని గాంధీ విగ్రహం వద్ద హత్య కు గురి అయ్యారు. కాగా పోలీసుల అమరవీరుల వారోత్సవాలలో భాగంగా హోంగార్డు శ్రీనివాస్ రావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాస్ గౌడ్, ఎస్ ఐ రాహుల్ రెడ్డి లు పండ్లు అందజేశారు. భవిష్యత్ లో పోలీస్ శాఖ మీకు అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు.

# ఇందిరమ్మ ఇండ్లకు కేరాఫ్ కాంగ్రెస్ ప్రభుత్వం

**-కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**చురకలు ప్రతినిధి కరీంనగర్, అక్టోబర్ 23 :** పేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నది దమ్మున్న కాంగ్రెస్ ప్రభుత్వమేననీ, ఇందిరమ్మ ఇండ్లకు కేరాఫ్ కాంగ్రెస్ అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.నాడైనా నేడైనా పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది ఒక కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ పాలకులు 10 ఏళ్ల కాలం పాటు అధికారంలో ఉన్నా ఒక్క ఇంటి నిర్మించలేకపోయారనీ, పేదల ఓట్లను దండుకొని వారిని మోసం చేశారని మండిపడ్డారు. గురువారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గాంధీ రోడ్డులోని కారా?నా గడ్డ లో కాసారపు వనిత, ప్రవీణ్ దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు వెలిచాల రాజేందర్ రావు తన చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు.రాజేందర్ రావు మాట్లాడుతూ పదేళ్ల కాలం నుంచి పేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తు న్నారనీ వారి కలను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజం చేసి చూపిస్తున్నారని తెలిపారు.ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఐదు లక్షలు అందించడం గొప్ప నిర్ణయం అని పేర్కొన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు కరీంనగర్ రూరల్ మండలం,కొత్తపల్లి మండలంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిం చేందుకు కృషి చేస్తానని రాజేంద్రరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దసరా కానుకగా 4000 ఇండ్లను మంజూరు చేశారనీ,కొద్ది రోజుల్లో మరో నాలుగు వేల ఇండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేయనున్నారని తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న అర్హులైన పేదలం దరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయని చెప్పారు. పేదలందరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజేందర్ రావు స్పష్టం చేశారు.పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడు తున్నదని పేర్కొన్నారు. పేదలంతా సంక్షేమ పథకాలను సద్విని యోగం చేసుకొని అభివృద్ధి చెందాలని రాజేందర్ రావు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కల్లేపల్లి బాలరాజు,గండి శ్యాము,తాండ్ర శంకర్, కాసారపు కిరణ్,గండి గణేష్ గసికంటి కుమార్,జాగిరి సాగర్,నీర్ల ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామం చేరిన ఆకుల శ్రీకాంత్ గౌడ్ మృత దేహం

**-శోక సంద్రంలో కుటుంబ సభ్యులు**
**-కొడుకు చితికి నిప్పంటించిన కన్న తండ్రి**
**-అశ్రు నయనాల మధ్య గల్ఫ్ లో మృతి చెందిన శ్రీకాంత్ గౌడ్ అంత్యక్రియలు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 23 :** ఉపాధి కొరకు మస్కట్ లోని ఒమాన్ కు వెళ్ళిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలంలోని గొల్లపల్లికి చెందిన ఆకుల శ్రీకాంత్ గౌడ్ అనారోగ్యంతో ఈ నెల 19 న ఒమాన్ దేశంలో మృతి చెందగా ఈ రోజు ఉదయం ఆయన మృత దేహం స్వగ్రామానికి చేరుకుంది. ప్రత్యేకంగా తయారు చేసిన శవ పేటికతోఅంబులెన్స్ లో శ్రీకాంత్ గౌడ్ మృతదేహం ఇంటికి చేరుకోవడంతో తల్లి దండ్రులు,చెల్లెళ్ళు,బంధు మిత్రులు శ్రీకాంత్ గౌడ్ మృత దేహాన్ని చూసి తీవ్రంగా రోదించారు.భారీగా గౌడ సంఘం నాయకులు, కులస్తులు, బంధువులు,మిత్రులు శ్రీకాంత్ గౌడ్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. మృత దేహాన్ని వైకుంఠ రథంలో గొల్లపల్లి గ్రామంలోని శ్మశాన వాటికకు తరలించగా కన్న కొడుకు చితికి కన్న తండ్రి ఆకుల అంజాగౌడ్ నిప్పంటించి అంత్యక్రియలు పూర్తి చేసిన విషాద ఘటన అందరిని కంట తడి పెట్టించింది. వున్న ఊరిలో సరైన ఉపాధి అవకాశాలు లేక పోవడంతో ఒమన్ దేశంకు ఉపాధి కొరకు వెళ్ళి ఆర్థికంగా బలపడాలని భవిష్యత్ పై ఎన్నో ఆశలతో ఒమన్ వెళ్ళిన శ్రీకాంత్ గౌడ్ ను అనారోగ్యం బలి తీసుకుంది.ప్రాణాలు కోల్పోయి శవ పరీక్షలో ఇంటికి చేరిన శ్రీకాంత్ గౌడ్ కలలు కళ్ళలయ్యాయి. కన్న వారికి కడుపు కోత మిగిల్చి తిరిగి రాని లోకాలకు తరలి వెళ్ళాడు.శ్రీకాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బంధువులు,మిత్రులు కోరుతున్నారు.

## రక్తదానం చేసిన
# కమాన్‌పూర్ యువకులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** కమాన్ పూర్ గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్ సభ్యులు గురువారం రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మంథనిలో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో ఎస్సై కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు నారగోని 63 ఉంటది సతీష్, మల్యాల విజయ్, కీర్తి పూర్ణచందర్ నల్లవెల్లి ఈశ్వర్ గరిగంటి విష్ణు రక్త దానం చేయడం జరిగింది. హెల్పింగ్ హాండ్స్ ద్వారా మరి నీ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని నారగోని సతీష్ తెలిపారు. అలాగే రక్తదాన లోపాలుగొన్న కమాన్ పూర్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులను పెద్దపెల్లి డిసిపి పి కరుణాకర్ గోదావరిఖని ఏసిపి మడత రమేష్ కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ రక్తదాతలను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

## చికిత్స కోసం 1 లక్ష 25 వేల
# ఎల్ఓసి అందజేత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** తెలంగాణ రాష్ట్ర ఐటి &పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గంలోని ముత్తారం కు చెందిన మండల లక్ష్మణ్‌కి రూ 1,25,000వేల ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు.మంథని నియోజక వర్గంలోని ముత్తారంకు చెందిన మండల లక్ష్మణ్‌కి అనారోగ్య వైద్య చికిత్సకు సంబంధించిన (1,25,000 ఎల్ ఓ సి) నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 1,25,000 వేల ఎల్ వో సి మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది.చికిత్స కోసం 1,25,000 వేల ఎల్ ఓ సి మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకి...వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సేవకు లైన్స్ క్లబ్ అంకితం

**-అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** ప్రజా సేవకు కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అంకితం అని అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి అన్నారు.లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ ఆధ్వర్యంలో కమాన్ పూర్ కేంద్రంలో ఉచిత నేత్రవైద్య శిబిరం కమాన్ పూర్ కార్యక్రమం లో కంటి పరీక్షలు నిర్వహించగా కంటి ఆపరేషన్లకు అవసరమైన 21మందిని కరీంనగర్ రేకుర్తి హాస్పిటల్ కు పంపించడం జరిగింది. 21మందికి పరీక్షలు నిమిత్తం ఖర్చయే 220 రూపాయలు 21 మందికి 5,060 రూపాయలు ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయకుమార్ అందజేశారు. కార్యక్రమం లో లైన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శి నల్ల వెల్లి శంకర్ కోశాధికారి డాక్టర్ విజయకుమార్ లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ గిరి రాము, చౌడవరం లింగమూర్తి,లయన్ జబ్బర్ ఖాన్,ముకుంద రాజన్న,గాదే బాలు,అనే వేరే లక్ష్మీరాజ్యం ఇలాగే చెట్టి చంద్రమౌళి గాదే బాలు అనే వేని లక్ష్మీరాజ్యం టెక్నీషియన్ లయన్ ప్రభాకర్ ఏఎన్ఎంలు భారతి,శ్రీలత,ఆశ వర్కర్లు అమూర్త విజయ కృష్ణవేణి,ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 23 :** ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సందే సతీష్ ఆధ్వర్యంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు లబ్ధిదారులు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగుళ్ళ మధు యాదవ్ కదిరే శ్రీనివాస్ పొన్నం బాలకిషన్ బిసి సెల్ అధ్యక్షులు అనవేని రవి చిట్కూరి బాలయ్య ధర్మారపు రవి మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వద్దు జనప సంచులు ముద్దు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** ప్లాస్టిక్ భూతాన్ని నిషేధించే బాధ్యత అందరిపై ఉంది అనే లైన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి కోశాధికారి డాక్టర్ పి విజయకుమార్ అన్నారు.గురువారం కమాన్ పూర్ మండల కేంద్రంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురికి చేతి సంచులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల గ్రామాల్లో కలుషితమవుతుందని కాలుష్యం పెరిగిపోతుందని పేర్కొన్నారు.దీనివల్ల ప్రజలకు ఇబ్బంది కలుగు తుందని రానున్న రోజుల్లో కాలుష్యం కోరల్లో ప్రజలు ఉండాల్సి వస్తుందని దీంతో జబ్బులు పెరిగిపోతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మార్కెట్ కు వెళ్లేటప్పుడు విధిగా చేతి సంచులను తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు కంకణం కట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి శంకర్, ప్రభాకర్,ముకుంద రాజన్న, జబ్బార్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పాల్గొన్న సుడా చైర్మన్

**-అర్హులైన చివరి లబ్ధి దారుని వరకు ఇళ్లు మంజూరు చేస్తాం**
**-ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**
**-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :** కొత్తపల్లి హవేలీ లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.కొత్తపల్లిలో మొత్తం 181 ఇళ్లు మంజూరు కాగా15 ఇళ్లకు నరేందర్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భం గా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంకా మిగిలిపోయిన అర్హులకు కూడా మంజూరు చేస్తామని స్థానిక నాయకులు వెంటనే మిగిలిపోయిన లబ్ధిదారుల జాబితా తయారు చేసి సంభందిత పత్రాలు ఇవ్వాలని సూచించారు. అర్హులైన చివరి లబ్ధిదారుని వరకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, వార్డ్ ఆఫీసర్లు,అబ్దుల్ అలీ, నర్సయ్య, గడ్డం శ్రీనివాస్,దుబ్బసి కుమార్,చిల్క హనుమత్ రెడ్డి,ఎర్రం కనకరెడ్డి,యస్వడా రాజు,జేరిపోతుల వాసు, కుతటి శ్రీనివాస్, చింతల శ్రీనివాస్ రెడ్డి, బూసా వీరు, గున్నాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో టీఆర్‌పీ ముఖ్య నాయకుల సమావేశం

**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీఆర్‌పీ) ముఖ్య నాయకుల సమావేశం కరీంనగర్ లోని ఐబిఎ గార్డెన్‌లో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించ బడింది.ఈ సందర్భంగా అఖిల్ పాషా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్‌ని ఘన స్వాగతం పాలికారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజిని కుమార్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీఆర్‌పీ బలమే తెలంగాణ భవిష్యత్తు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పునాదులను మరింత పటిష్టం చేయడం మన అందరి బాధ్యతని పిలుపునిచ్చారు.జిల్లాల వారీగా నియోజకవర్గ,మండల,గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతంపై విస్తృత చర్చ జరిగింది.జిల్లా స్థాయిలో క్రియాశీలకం గా పని చేసేందుకు ఆసక్తి చూపిన నాయకుల అభిప్రాయాలను రాష్ట్ర నాయకత్వం ప్రత్యక్షంగా సేకరించింది. రాష్ట్ర కార్యవర్గం చర్చించి రెండు



రోజుల్లో జిల్లాల కన్వీనర్లు, కో-కన్వీనర్ల నియామకాలను ప్రకటించనున్నట్లు మాదం రజిని కుమార్ వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు ఉత్సాహభరితంగా పార్టీ బలపరచడంపై తమ సంకల్పాన్ని వ్యక్తం చేశారు.ఈ సమావేశం టీఆర్‌పీ శక్తి, ఐక్యత, స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, పార్టీ విస్తరణకు నూతన దిశను చూపిందని నాయకులు పేర్కొన్నారు.

# అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం**
**- సీపీ గౌష్ ఆలం**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం నాడు పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు కరీంనగర్ పోలీసు కమీషనర్ సీపీ గౌష్ ఆలం తెలిపారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరు, విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ పరికరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా, డాగ్ స్క్వాడ్ (పోలీసు జాగిలాలు), ఆయుధాలు, అన్ని రకాల తుపాకులు, అల్లర్ల నియంత్రణకు వినియోగించే స్మోక్ గన్, షెల్స్, బాంబు నిర్వీర్య విభాగం యొక్క పని విధానాన్ని వివరించారు. అలాగే, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, పోలీసులు వినియోగించే కమాండ్ కంట్రోల్ వాహనం, అల్లరిమూకలను చెదరగొట్టేందుకు వినియోగించే స్మోక్ షెల్స్ ను పేల్చేందుకు వీలుగా వుండే వజ్ర వాహనంతో పాటు ప్రదర్శనలో ఉంచారు.షీ టీం, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, యాంటీ నార్కోటిక్ సెల్, ట్రాఫిక్ విభాగానికి సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, విద్యార్థులకు వాటి గురించి పూర్తి వివరాలు అందించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరం జరిగినట్లయితే వెంటనే ఫిర్యాదు చేసే విధానాలు తెలిపే స్టాల్‌ను విద్యార్థులు ఆసక్తిగా సందర్శించారు.పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం తెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో మరియు కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.

# అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు : మంథని డిఎం శ్రవణ్ కుమార్

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 23 :** కార్తీక మాసం సందర్భంగా మంథని డిపో నుండి తమిళనాడు అరుణాచలం కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపించడం జరుగుతుందని మంథని టీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్ తెలిపారు.కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా నవంబర్ 5న తమిళనాడు లోని అరుణాచలంలో జరిగే గిరి



ప్రదక్షిణకు మంథని డిపో నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపించనున్నట్లు డిపో మేనేజర్ వి. శ్రవణ్ కుమార్ తెలిపారు.వచ్చేనెల 3న సాయంత్రం మంథని బస్టాండ్ నుంచి బయలుదేరి కరీంనగర్, హైదరాబాద్ మీదుగా కాణిపాకం మరియు గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం 4వ తేదీన రాత్రి అరుణాచలం చేరుకుంటుంద న్నారు.5వ తేదీన సాయంత్రం అరుణాచలం నుండి బయలుదేరి 6వ తేదీన ఉదయం శ్రీ అలంపూర్ జోగులాంబ అమ్మవారి దర్శనం అనంతరం బయలుదేరి కరీంనగర్ మీదుగా మంథని చేరుకుంటుందన్నారు. చార్జి ఒక్కరికి ఫుల్ టికెట్ రూ.5040 హాఫ్ టికెట్ రూ.3790 ఉంటుందని తెలిపినారు. టికెట్ బుకింగ్ కొరకు మంథని డిపో నందు గాని ఈ 9959225923 9948671514 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## ఇంఫ్రూవ్మెంట్ ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్,సెస్ డైరెక్టర్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 23 :** ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో గురువారం సుమారు4 లక్షల 50వేల రూపాయలతో ఇంప్రూవ్మెంట్ ట్రాన్స్ఫార్మర్ ను మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సాబేరా బేగం సెస్ డైరెక్టర్ కృష్ణ హరి కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా నారాయణపూర్ గ్రామంలోని బాలసంతుల కాలనీలో 18 ఇండ్లకు నిరంతర విద్యుత్తును అందించే విధంగా ఏర్పాటు చేశారు అదే మాదిరిగా మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా 24 గంటల విద్యుత్ సౌకర్యం కలిగే విధంగా పెద్దమ్మ ఒర్రె వద్ద మంచినీటి బోరుకు నిరంతర విద్యుత్ సరఫరా ప్రక్రియను ఏర్పాటు చేశారు అంతేకాకుండా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ గ్రామంలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అదనంగా గ్రామంలో మరో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు అలాగే గ్రామానికి మంచినీటి సరఫరా ఎప్పుడు అయ్యే విధంగా మానేరువాగులో మంచినీటి బావికి నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు శ్రీరామనవమి సందర్భంగా రథానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయాలని.సెస్ఎ ఇ పృథ్వీ.డైరెక్టర్ వరుస కృష్ణహరిలకు గ్రామపంచా యతీ తీర్మానాన్ని అందించారు ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్.హెల్పర్ సతీష్.జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ నాయకులు నిమ్మ నారాయణరెడ్డి మల్లారెడ్డి దొమ్మాటి దేవయ్య వంగల లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ లేదు..

## పాత కమిటే రెండు గుళ్ళు పూర్తి చేస్తదీ

**-పాత కమీటీ చైర్మన్ భాస్కర్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 23 :** నూతన కమిటీ లేదుపాత కమిటే రెండు గుళ్ళు నిర్మాణం పనులు పూర్తి చేస్తదీ పాత కమీటీ చైర్మన్ బాస్కర్ పేర్కొన్నారు.కెసిఆర్ కాలని లోని డబల్ బెడ్ రూమ్ ల్లోని అన్ని బ్లాకుల పెద్ద మనుషులు కలిసి కొత్త కమిటీని ఎన్నుకోలేదని కొందరు వ్యక్తులు మాత్రమే నూతన కమిటీ ని ఎన్నుకున్నట్లు విలేకరులతో చెప్పారని భాస్కర్ చెప్పారు. పునాదుల నుండి రెండు గుళ్ళు కష్టపడి నిర్మించడం జరిగిందని త్వరలోనే అన్ని బ్లాకుల పెద్ద మనుషులతో సమావేశమై చర్చించి మైసమ్మ పోచమ్మ గ్రామ దేవతల విగ్రహములను ప్రతిష్టించడం జరుగుతుందని ఆయన భాస్కర్ ప్రకటించారు.

## 50 సార్లు రక్తదానం చేసిన పోతరవేణి క్రాంతి కుమార్



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ మంత్ని ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో గురువారం పోతరవేణి క్రాంతి కుమార్ రక్తదానం చేయగా, 50 సార్లు రక్తదానం చేసే సందర్భంగా పెద్దపల్లి డిసిపి కరుణాకర్, గోదావరిఖని ఏసిపి మడత రమేష్ అభినందించారు. మంథని సీఐ రాజు, ఎస్సై రమేష్, ఎస్సై 2 సాగర్, ఇండియన్ రెడ్ల సొసైటీ పెద్దపల్లి చైర్మన్ రాజగోపాల్, లైన్స్ క్లబ్ ఆఫ్ మంథని అధ్యక్షుడు మేడగోని వెంకటేష్ చేతుల మీదుగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# ప్రతి పేద మహిళ స్వయం సహాయక సంఘాల్లో ఉండాలి

**-వారికి బ్యాంకు ఖాతా, లింకేజీ కల్పించాలి**
**-మహిళల అక్షరాభ్యాసం పూర్తి చేయాలలి**
**-సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంక్ లు ఏర్పాటు చేయించాలి**
**-హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 23 :** జిల్లాలోని ప్రతి పేద మహిళ స్వయం సహాయక సంఘాలో సభ్యురాలుగా ఉండాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశించారు. జిల్లాలోని సెర్ప్ డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించగా,ముఖ్య అతిథిగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ హాజరయ్యారు.ముందుగా పలువురికి పోషకాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సెర్ప్ సీఈవో మాట్లాడారు. సెర్ప్ ప్రతిజ్ఞ ప్రకారం అందుకున్న విజయాన్ని అందరికీ పంచుదాము అనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కింద పేద మహిళలను ఆర్థికంగా ఉన్నత స్థానాలకు తీసుకెళ్లల నేదే లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలోని పేద మహిళలు మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని,వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి ఆర్థికంగా ఎదిగేలా మద్దతు ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఎస్ హెచ్ జీలకు భవనాలు ఉండాలని, సభ్యులందరూ అక్షరాభ్యాసం పూర్తి చేయాలని, వృద్ధ మహిళల, దివ్యాంగుల, కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్, సోలార్ పవర్ యూనిట్, మండలానికి ఒక ఆర్టీసీ బస్సు ఇప్పించేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు.ప్రతి గ్రామంలో పేద గర్భిణీలు, పోషకాహార లోపం ఉన్న పిల్లలను దత్తత తీసుకుని వారికి పోషకాహారం అందించాలని పిలుపు ఇచ్చారు. ఎస్ హెచ్ జీలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలని ఆదేశించారు. దీంతో మిగతా వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రుణాల రికవరీలో జిల్లా రాష్ట్రంలోనే ముందు స్థానంలో ఉండాల ని ఆకాంక్షించారు.రానున్న ఉగాదిలోగా జిల్లాలోని మహిళలందరూ కనీసం చదువుకొని తమ బ్యాంకు ఇతర అన్ని కార్యకలాపాలు పూర్తి చేసుకునేలా తీర్చిదిద్దాలని పిలుపు ఇచ్చారు.ప్రతి పేద మహిళ స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలుగా చేరాలని, వారు ఆర్థికంగా ఎదగాలని, విద్యా వంతులు కావాలని ఆకాంక్షించారు.అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడారు .జిల్లాలోని మహిళా సంఘాలకు 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కేటాయించామని,పేద ఎస్ హెచ్ జీ సభ్యులు ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు ఇప్పటిదాకా ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున మొత్తం రూ. 10కోట్లు ఇచ్చామని,వీఓ బిల్డింగ్స్ నిర్మాణానికి కృషి చేస్తామని, పెట్రోల్ బంక్, సోలార్ పవర్ యూనిట్ ఇతర పనులు పూర్తి చేస్తామని వివరించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్, డిఆర్ డిఓ శేషాద్రి అడిషనల్ డిఆర్ డిఓ శ్రీనివాస్,జిల్లా సమాఖ్య అధ్యక్షు రాలు భాగ్య తదితరులు పాల్గొన్నారు.



# వీణవంక పిఎస్‌లో "ఓపెన్ హౌస్"




**-విద్యార్థులకు చట్టాలపై అవగాహన**
**-హుజురాబాద్ ఎసిపి మాధవి**

**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 23 :** కరీంనగర్ జిల్లా సిపి గౌస్ ఆలం ఆదేశాల మేరకు గురువారం వీణవంక పోలీస్ స్టేషన్లో "ఓపెన్ హౌస్"కార్యక్రమాన్ని ఎస్ఐ ఆవుల తిరుపతి ఏర్పాటు చేయగా హుజురాబాద్ ఎసిపి మాధవి పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకుచట్టాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సూచించారు. మత్తు పదార్థాలు సేవిస్తే టెస్ట్ కిట్ ద్వారా గుర్తించవచ్చని వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కల్పించారు. షీ టీమ్స్, ఫ్రెండ్లీ పోలీస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో వెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ,కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపల్ మనోజ్ ,విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి కళాకారుడు రాధాకృష్ణకు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 23 :** సింగరేణి ఆర్‌జి-3 ఏరియా ఓసీపీ-1 కన్వేయర్ ఆపరేటర్, సింగరేణి సీనియర్ కళాకారుడు కొండ్ర రాధాకృష్ణను ఘనంగా సన్మానించారు. సెంటినరీ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్‌జి-3, భూపాలపల్లి ఏరియా ప్రాంతీయస్థాయి సాంస్కృతిక పోటీల సందర్భంగా, సింగరేణి మాజీ క్రీడా, కళాకారుడు, నిరీక్షణ క్రియేషన్స్ అధినేత చంద్రపాల్ ఆధ్వర్యంలో రెండు ఏరియాల కళాకారులు రాధాకృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోటీలకు న్యాయనిర్ణేతగా హాజరైన ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కే.స్వామి , స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్ మాట్లాడుతూ రాధాకృష్ణ క్రమశిక్షణ, ప్రతిభ కలిగిన క్రీడాకారుడు, కళాకారుడని పేర్కొన్నారు. 1992లో సింగరేణి సంస్థలో ఉద్యోగంలో చేరినప్పటి నుండి క్యారంబోర్డు, టేబుల్ టెన్నిస్, హాకీ వంటి క్రీడల్లో రాణించి, కోల్ ఇండియా స్థాయి పోటీలలో పలు పతకాలు సాధించారని,అలాగే సాంస్కృతికరంగంలో జానపద, లలిత గీతాలు, గజల్ గాయకుడిగా కూడా ప్రతిభ కనబరచారని ప్రశంసించారు. రానున్న ఏప్రిల్ లో ఉద్యోగ విరమణతో ఒక మంచి కళాకారుడిని కోల్పోవడం బాధాకరమైనప్పటికీ, అది ప్రతి ఉద్యోగి జీవనంలో అనివార్యమని పేర్కొన్నారు. కాగా ఈ ప్రాంతీయస్థాయి సాంస్కృతిక పోటీలలో కళాకారుల అద్భుత ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి.ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి స్పోర్ట్స్, కల్చరల్ కో ఆర్డినే టర్స్, కళాకారులు అంజి, దేవయ్య, కె.ఎల్.ఎన్. ప్రసాద్, సదానందం, తాళ్లపల్లి నారాయణ, అడిచర్ల శ్రీనివాస్, మహేందర్, రాయమల్లు, మేజిక్ రాజా తదితరులు పాల్గొని రాధాకృష్ణకు శు భాకాంక్షలు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే
# ధాన్యం విక్రయించాలి



**-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 23 :** రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.గురువారం రామడుగు మండలం వెదిర రైతు వేదిక ప్రాంగణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ- టీ సెర్ఫ్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యం క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం రూ.2389, సాధారణ రకం ధాన్యానికి రూ.2369 అందిస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్న రకాలకు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తుందని పేర్కొన్నారు. రైతులు తమ పంటను తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, గన్ని సంచులు తదితర వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వసతులు కల్పిస్తుందన్నారు.సన్న రకం వడ్లు పండించే రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 500 ను బోనస్ గా ఇస్తుందన్నారు.రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గరిమా అగ్రవాల్

**-ఇంచార్జి కలెక్టర్‌గా సైతం..**
**సెలవులో వెళ్లిన కలెక్టర్ ఎం హరిత**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 23 :** జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా సమీకృత కార్యాల యాల సముదాయానికి అదనపు కలెక్టర్ చేరుకోగా, అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు.కలెక్టర్ ఎం హరిత సెలవుపై వెళ్లగా, ఇంచార్జి కలెక్టర్ గా సైతం గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి,శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.